RNI NO.APTEL/2006/18110

## కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు లేదు.. : వివేక్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,4:**
కాంగ్రెస్ పార్టీలో ఎక్కడా వర్గపోరు లేదని, నాయకులంతా ఏకతాటిపై నిలిచి పార్టీ బలోపేతంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నా రని తెలంగాణ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.
మంచిర్యా ల జిల్లా పర్యటనలో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల పాలనలో ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజాదరణ పొందిందని వెల్లడించారు.


ప్రతి అక్షరం...    ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక


## ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం..

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,4:**
దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు,మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాం తాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 288 | పబ్లిషర్ : కొక్కు రవికుమార్ | శనివారం 5 - 9 - 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00

### ఆ పోస్టులతో మాకు సంబంధం లేదు

# కొండా సురేఖ స్పష్టీకరణ

- తన పేరుతో సర్క్యులేట్ అవుతున్న పోస్టులను ఖండించిన కొండా సురేఖ
- క్రమశిక్షణ చర్యల కింద కేబినెట్ నుంచి సురేఖకు ఉద్వాసన
- కుమార్తె వ్యాఖ్యలపై ఇచ్చిన షోకాజ్ నోటీసుతో మొదలైన వివాదం
- అధిష్టానాన్ని బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని రేవంత్ రెడ్డిపై ఆరోపణ
- కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని స్పష్టం చేసిన మాజీ మంత్రి



**హైదరాబాద్,సెప్టెంబర్,4:**
తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తనకుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు.మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు.కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు.
గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సీఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సీఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకాశ్ రెడ్డి బరిలో ఉన్నా, తాను పరకాల నుంచి పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ సంఘం సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయలేరని సురేఖ ఇచ్చిన సమాధానంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రమశిక్షణ సంఘం ఆమెపై కఠిన చర్యలకు సిఫార్సు చేసింది. కాగా,కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని ఆమె ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి,ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఈ కుట్ర వెనుక ఉన్నారని విమర్శించారు. అయితే, తాను, తన భర్త కొండా మురళి కాంగ్రెస్ పార్టీని వీడబోమని ఆమె స్పష్టం చేశారు. బీజేపీలోచేరడం లేదా కొత్త పార్టీ పెట్టడం వంటి ప్రచారాన్ని తోసిపుచ్చుతూ "నేను ఎక్కడికీ వెళ్లడం లేదు" అని స్పష్టం చేశారు.

# ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు..

- అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!
- మోదీని కలవడానికి ట్రంప్ ఆసక్తిగా ఉన్నారన్న సెర్గియో గోర్
- డిసెంబర్‌లో జీ20 సదస్సు కోసం అమెరికా పర్యటనకు మోదీ
- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలో ఖరారయ్యే సూచనలు
- 500 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం భారత్ విశ్వసనీయ రక్షణ భాగస్వామి అన్న గోర్



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,4:**
జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరుదేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్‌దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా–భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు.
భారత స్థిరత్వం కీలకం: భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాలయం సహకరించిందన్నారు. భారత్ తమకు విశ్వసనీయమైన రక్షణ భాగస్వామి అని గోర్ పేర్కొన్నారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కావని, పరస్పర విశ్వాసం కూడా కీలకమని చెప్పారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, మరిన్ని రక్షణ పరికరాలపై చర్చలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు.

### వీహెచ్ తర్వాత నేనే సీనియర్..

# ఒక్క పోటుతో కూల్చేశారు: చిన్నారెడ్డి

- *ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించడంపై చిన్నారెడ్డి ఆవేదన*
- *మేఘారెడ్డి ఫిర్యాదు ఆధారంగా మల్లు రవి ఏకపక్షంగా వ్యవహరించారని మండిపాటు*
- *కేబినెట్ హోదాలో ఉన్నప్పుడే ప్రోటోకాల్ వదులుకున్నానని వెల్లడి*

**హైదరాబాద్,సెప్టెంబర్,4:**
తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తనను తప్పించబడటంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి చిన్నారెడ్డి మండిపడ్డారు. ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన నాటి నుంచి తాము ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నామని, క్రమశిక్షణతో కష్టపడి ఈ స్థాయికి వచ్చిన తనను 'ఒక్క పోటుతో కూల్చేశారని' ఆవేదన వ్యక్తం చేశారు. పదవి నుంచి తొలగించిన అనంతరం వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని తన సొంతూరు జయన్న తిరుమలాపురంలోని వ్యవసాయ క్షేత్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం పార్టీలో తలెత్తిన ఈ సమస్యలకు, తనపై జరిగిన చర్యలకు ఎంపీ, పీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి మాత్రమే ప్రధాన కారణమని చిన్నారెడ్డి నేరుగా ఆరోపించారు. స్థానిక పరిణామాల నేపథ్యంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫిర్యాదు ఆధారంగా మల్లు రవి ఏకపక్షంగా వ్యవహరించారని మండిపడ్డారు.
మాజీ మంత్రి కొండా సురేఖఆమె బర్తరఫ్ వేళ అధిష్ఠానంతో మాట్లాడేందుకు ఢిల్లీకి వెళ్లినాఫలితం దక్కలేదని... అందుకే తన పరిస్థితి కూడా అలాగే మారుతుం దనే ఉద్దేశంతో తాను ఢిల్లీకి కానీ, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వద్దకు కానీ వెళ్లేందుకు ప్రయత్నించలేదని స్పష్టం చేశారు. పార్టీలో వి.హనుమంతరావు తర్వాత అత్యంత సీనియర్ నాయకుడిని



తానేనని చిన్నారెడ్డి గుర్తుచేశారు.
తెలంగాణ ఉద్యమ సమయంలో 42 మంది ఎమ్మెల్యేలతో వనపర్తిలో భారీ బహిరంగ సభ నిర్వహించి, సంతకాల సేకరణతో ఉద్యమానికి ఊపిరి పోసిన చరిత్ర తనదని పేర్కొన్నారు. తనకు పదవి ఇచ్చేటప్పుడే ఉత్తర్వుల్లో ఎలాంటి నిర్దిష్ట కాలపరిమితి విధింపు లేకుండా 'తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు' మాత్రమే అని ఇచ్చారని, పైగా కేబినెట్ హోదా ఉన్నప్పుడే తాను ప్రోటోకాల్ సదుపాయాలను వదులుకున్నానని చెప్పారు. తన కుమారుడికి పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రిని ఎప్పుడూ కోరలేదని, పదవి ఉన్నా లేకున్నా తన వ్యక్తిగత గౌరవం తనకు ఉంటుందని, భవిష్యత్తు కార్యాచరణపై కార్యకర్తలతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు.

### దమ్ముంటే హరీశ్ రావు భార్య

# నాపై పోటీ చేయాలి: కవిత

***తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్న కవిత***
***తాను సీఎం కావాలని కోరుకుంటున్నానని వెల్లడి***
***బీజేపీతో హరీశ్ రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపణ***

తెలంగాణలో రాజకీయ ప్రత్యర్థుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర స్థాయికి చేరాయి. నూతనంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించిన కల్వకుంట్ల కవిత... బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో ధైర్యముంటే హరీశ్‌రావు తన భార్యను తనపై పోటీకి దింపాలని బహిరంగ సవాల్ విసిరారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించిన కవిత... హరీశ్‌రావు నేరుగా బరిలోకి రాకుండా తెరవెనుక రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.
అవసరమని భావిస్తే రాజకీయాలను పక్కనపెట్టి ఆయన తన భార్యను బరిలోకి దించవచ్చని, ఆమె తనపై పోటీ చేసినా స్వాగతిస్తానని స్పష్టం చేశారు. గతంలో సిద్దిపేట నుంచి హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాటను గుర్తు చేసిన కవిత... వచ్చే ఎన్నికల్లో తాను సిద్దిపేట లేదా బోధన్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుం టున్నట్లు సంకేతాలిచ్చారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి



పదవిపై తన ఆకాంక్షను కవిత బహిరంగంగా వెల్లడించారు. తాను సీఎం కావాలని అనుకుంటున్నానని, ఆ పదవికి హుందాతనం, గౌరవంచాలా ముఖ్యమని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు బీజేపీతో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు.

# తెలంగాణలో కొత్త పింఛన్ దరఖాస్తుదారులకు ఉపశమనం



**ఆన్‌లైన్, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం**
**సర్టిఫికెట్లు లేకున్నా అప్లై చేసుకోవచ్చు..**
**వెరిఫికేషన్ సమయంలో మాత్రం సర్టిఫికెట్లు తప్పనిసరి**
**సర్టిఫికెట్ల జాప్యంతో అర్హులకు ఇబ్బందులు**
**దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఊరట**
**కొత్త పింఛన్లకు సెప్టెంబర్ 15 చివరి తేదీ**

కొత్త పింఛన్ కోసం ఎదురుచూస్తున్న అర్హులకు తెలంగాణ ప్రభుత్వం ఊరటనిచ్చింది. దరఖాస్తు సమయంలో ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా.. వాటి కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ముందుగా కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం, సెర్ప్ వెల్లడించింది. దీంతో సర్టిఫికెట్లు రావడంలో జాప్యం కారణంగా దరఖాస్తు గడువు మిస్ అవుతుందేమోనని ఆందోళన చెందుతున్న వారికి ఉపశమనం లభించింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే దివ్యాంగుల సర్టిఫికెట్లు, కులం, ఆదాయం, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఆలస్యం జరుగుతున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ, తహసీల్దార్ కార్యాలయాలు, సదరం క్యాంపుల నుంచి సర్టిఫికెట్లు పొందేందుకు సమయం పడుతుండటంతో అర్హులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల కోసం ఆగకుండా ముందుగా ఆన్‌లైన్‌లో లేదా నిర్దేశిత మీసేవా కేంద్రాల్లో కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సెర్ప్ స్పష్టం చేసింది. అయితే ఇక్కడే ఓ కీలక నిబంధన ఉంది. వెరిఫికేషన్‌లో మాత్రం తప్పనిసరి: దరఖాస్తు చేసే సమయంలో ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా ఫర్వాలేదు. కానీ అధికారులు దరఖాస్తును పరిశీలించే సమయంలో మాత్రం సంబంధిత సర్టిఫికెట్లను తప్పనిసరిగా సమర్పించాలి.
కాబట్టి దరఖాస్తు చేసుకున్న తర్వాత అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసు కోవాలని అధికారులు సూచిస్తున్నారు. సెప్టెంబర్ 15 వరకు అవకాశం: కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 చివరి తేదీగా అధికారులు ప్రకటించారు. అర్హత ఉన్న వారు ఇంకా దరఖాస్తు చేయకపోతే ఎలాంటి ఆలస్యం చేయకుండా గడువులోపు అప్లై చేసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. దీంతో అర్హులైన పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# బెంగాల్ ప్రభుత్వ సలహాదారుగా మిథున్ చక్రవర్తి.. సీఎం కీలక ప్రకటన



- బెంగాల్ ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారుగా మిథున్ చక్రవర్తి నియామకం
- కోల్‌కతాలో రూ.25 కోట్లతో 'ఉత్తమ్ కుమార్ ఫిలిం సెంటర్'కు శంకుస్థాపన
- ఫిలిం సెంటర్ రూపకల్పనలో ప్రభుత్వ జోక్యం ఉండదన్న సీఎం సువేందు

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సాంస్కృతిక సలహాదారు (కల్చరల్ అడ్వైజర్)గా బాలీవుడ్ ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి నియమితులయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సువేందు అధికారి శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. కోల్‌కతా శివారులోని న్యూ టౌన్‌లో 'ఉత్తమ్‌కుమార్ ఫిలిం సెంటర్' నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం సువేందు అధికారి మాట్లాడుతూ.. రూ.25 కోట్ల వ్యయంతో ఈ ఫిలిం సెంటర్‌ను నిర్మిస్తున్నామని, ఇందుకు అవసరమైన నిధులను రాష్ట్ర సమాచార, సాంస్కృతిక శాఖ ఇప్పటికే మంజూరు చేసిందని తెలిపారు. ఫిలిం సెంటర్ డిజైన్‌ను ఖరారు చేసే బాధ్యతను పూర్తిగా బెంగాలీ సినీ రంగ నిపుణులకే అప్పగిస్తామని, ప్రభుత్వం ఇందులో ఎలాంటి జోక్యం చేసుకోదని ఆయన స్పష్టం చేశారు. "ఈ రంగంతో సంబంధం ఉన్నవారికే ఆ పనిలో పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. మా పని కేవలం మద్దతు ఇవ్వడమే. ప్రతి విషయంలో జోక్యం చేసుకోవడం సరికాదు" అని సీఎం అన్నారు. కోల్‌కతాలోని ప్రఖ్యాత నందన్ కల్చరల్ సెంటర్ మాదిరిగా ఈ కొత్త ఫిలిం సెంటర్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో 750 సీట్ల సామర్థ్యంతో రెండు సినిమా హాళ్లు, ఒక ప్రివ్యూ థియేటర్, ఫుడ్ కోర్ట్, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. రెండో విభాగంలో 1,000 సీట్ల ఆడిటోరియం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఓపెన్-ఎయిర్ థియేటర్ ఉంటాయి. మూడో విభాగంలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్,గేమింగ్, పోస్ట్-ప్రొడక్షన్ కోసం అత్యాధునిక ల్యాబొరేటరీలు, స్టూడియోలు నిర్మిస్తారు. ఇప్పటికే సాయిల్ టెస్టింగ్, స్థల ఎంపిక పూర్తయ్యాయని, డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) ప్రక్రియ కొనసాగుతోందని సీఎం వివరించారు. వర్షాకాలం ముగిసిన వెంటనే పశ్చిమ బెంగాల్ హౌసింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు మొదలవుతాయని తెలిపారు. సెప్టెంబర్ 6 వరకు టాలీవుడ్ (బెంగాలీ చిత్ర పరిశ్రమ) కు చెందిన పలువురు ప్రముఖులను సన్మానించనున్నట్లు, ఈ సన్మాన గ్రహీతల ఎంపికలో కూడా ప్రభుత్వం జోక్యం చేసుకోదని, సినీ పరిశ్రమ కమిటీయే ఆ బాధ్యత తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.


# సంపాదకీయం

## భారత జాతీయోద్యమ పితామహుడు బాలగంగాధర తిలక్

బాలగంగాధర తిలక్ స్వరాజ్య పోరాటంలో పాల్గొన్న తొలితరం త్యగమూర్తులతో బాలగంగాధర తిలక్ అగ్రగణ్యులు. ఆయనను భారత జాతీయోద్యమ పితగా పేర్కొంటారు. తిలక్ జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలను ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో ఆయన పాత్ర మరిచి పోలేనిది. భరత జాతిని స్వాతంత్ర్య సమరోత్సాహంతో జాగృత మొనర్చిన మహానేత లోకమాన్య తిలక్. అందుకే ఆయనను భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేగిన అశాంతికి మూల కారకుడుగా భావిస్తారు. బాలగంగాధర తిలక్ 1856 జూలై 23వ తేదీన మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు, ఉపాధ్యాయుడు. బాల్యంలో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరచేవారు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటి తనం ఆయన సహజ గుణం. కళాశాలకు వెళ్ళి ఆధునిక విద్య నభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకరు. ఆంగ్ల విద్యను అందుకున్న తొలి తరం భారతీయులలో అగ్రగణ్యులు. ఆంగ్ల విద్య ప్రభావంతో భారతీయులు అనుభవిస్తున్న బానిసత్వం గురించి తెలుసుకున్న వర్గంలో కూడా తిలక్ అగ్రగణ్యులే. తిలక్ కు పదేళ్ళ వయసున్నప్పుడు అతను తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకు వచ్చింది. ఆయన అక్కడ ఆంగ్లో-వెర్నాక్యులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయుల వద్ద విద్యనభ్య సించారు. ఐతే పూణెకు వచ్చిన కొంతకాలానికే అతను తన తల్లిని, పదహారేళ్ళ వయసులో తన తండ్రిని కోల్పోయారు. మెట్రిక్యు లేషన్ చదువు తున్నప్పుడే సత్యభామ అనే పదేళ్ళ అమ్మాయితో పెళ్ళయింది. మెట్రిక్ పాసయ్యాక అతను దక్కన్ కళాశాలలో చేరారు. 1877లో అతను గణిత శాస్త్రంలో ప్రథమ శ్రేణిలో పట్టభద్రు డయ్యారు. ఆ తర్వాత తన చదువును కొనసాగించి ఎల్ ఎల్ బి పట్టా కూడా పొందారు. తిలక్ 1890లో కాంగ్రెస్ లో చేరారు. కానీ త్వరలోనే కాంగ్రెస్ మితవాద రాజకీయాలపై నమ్మకం పోయింది. స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని అతను నమ్మారు. అప్పటి వరకు కాంగ్రెస్ ప్రతి సంవత్సరం డిసెంబరు చివరి వారంలో మూడు రోజులపాటు సమావేశమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాల గురించి మెతక వైఖరి తో చర్చించడానికే పరిమితం అయ్యేది. మితవాదుల ధోరణి సమ్మతంగా ఉండేది కాదు. విన్నపాలు, వినతులు వలస ప్రభుత్వాన్ని లొంగదీయ లేవని తిలక్ సిద్ధాంతం. దాదాభాయ్ నౌరోజీ అంటే ఎంతో గౌరవం. భారత పేదరికం బ్రిటిష్ పుణ్యమేనన్న నౌరోజీ సిద్ధాంతాన్ని సమర్థించడమే కాకుండా, తన పత్రికలో ఎంతో ప్రాచుర్యం కల్పించారు. అలాగే గోఖలే చాలా అంశాలలో తిలక్ కు విభేదాలు ఉండేవి. కాంగ్రెస్ నేతల విధానాలపై తిలక్ ఘాటైన విమర్శలు చేశారు: "మీరు సంవత్సరాని కొకసారి మూడు రోజులపాటు సమావేశమై కప్పల మాదిరి బెకబెకలాడడం వల్ల ప్రయోజనం లేదు." అని, "అసలు కాంగ్రెస్ సంస్థ అడుక్కునేవాళ్ళ సంఘం (బెగ్గర్స్ ఇన్‌స్టిట్యూషన్)" అన్నారు. కాంగ్రెస్ సమావేశాలను 3-డే తమాషాగా అభివర్ణించారు. "స్వరాజ్యం నా జన్మహక్కు. దాన్ని నేను పొంది తీరుతాను." అని తీర్మానించారు. 1889లో బొంబాయి కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధిగా హాజరైన తిలక్ అక్కడనే లాలాలజపత్ రాయ్, బిపిన్‌చంద్ర పాల్‌ను కలుసు కున్నారు. ఆ ముగ్గురు మహా నేతలు భారతదేశ చరిత్రలో లాల్-బాల్-పాల్‌గా ప్రసిద్ధులైనారు. వారితోనే కాంగ్రెస్‌లో అతివాదుల శకం ప్రారంభమైంది. 1907లో మహారాష్ట్ర లోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపోగా, మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టును నిలబెట్టు కున్నారు. అతివాదులుగా పిలవబడే తిలక్, ఆయన మద్దతు దారులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916లో లక్నోలో జరిగిన సమావేశంలో అంతా ఒకటైనారు. అదే సమావేశంలో కాంగ్రెస్ కు, ముస్లిం లీగుకు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది. తిలక్ పాశ్చాత్య విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అది భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అగౌరవ పరచి భారతీయ విద్యార్థులను చిన్న బుచ్చే విధంగా ఉందని, ప్రజలకు మంచి విద్యను అందించడం ద్వారానే వాళ్ళను మంచి పౌరులుగా మార్చవచ్చనే ఉద్దేశం ఆయనది. ప్రతి భారతీయునికి భారతీయ సంస్కృతి గురించి, భారత దేశపు ఔన్నత్యాన్ని గురించి బోధించాలని ఆయన ఆశయం. అదే ఆశయంతో అగార్కర్, విష్ణుశాస్త్రి చిప్లుంకర్ లతో కలిసి "దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ"ని స్థాపించారు. తర్వాత తాను నడిపిన పత్రికలు "మరాఠా (ఆంగ్ల పత్రిక)", "కేసరి (మరాఠీ పత్రిక)" లలో మొద్దు నిద్రపోతున్న భారతీయులను మేల్కొల్పడానికి పదునైన భాషలో బ్రిటిష్ పాలనలోని వాస్తవ పరిస్థితుల గురించి వివరంగా రాశారు. బాల్య వివాహాలను నిరసించి వితంతు వివాహాలను స్వాగతించారు. జాతీయ స్ఫూర్తిని రగల్చడానికి వీలున్న ఏ అవకాశాన్నీ ఆయన వదిలి పెట్టలేదు. మొట్టమొదటి సారిగా శివాజీ ఉత్సవాలను, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించడం, వారిని జాతీయోద్యమం వైపు నడిపించడం మొదలు పెట్టారు. తన పత్రికల్లో ప్రజలను రెచ్చగొట్టే రాతలు రాసినందుకు 1897లో ఆయనకు ఒకటిన్నరేళ్ళు కారాగారశిక్ష పడింది. విడుదల య్యాక అతను స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1906లో దేశద్రోహం నేరం క్రింద ఆయనకు ఆరేళ్ళు ప్రవాసశిక్ష విధించారు. కారాగారంలో ఉన్నప్పుడే అతను "గీతారహస్యం" అనే పుస్తకం రాశారు. తిలక్ చరిత్రకారుడు కూడా. ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వచ్చారని ఆయన అభిప్రాయం. భగవద్గీతపై ఆయన రచించిన భాష్యం-856 పేజీల గీతా రహస్యం అనే ఉద్గ్రంథం మొదటి కూర్పు ఆరు వేల ప్రతులు ఒక పక్షంలోనే అమ్ముడు పోయాయంటే అది ఎంత ప్రజాభిమానమైన గ్రంథమో స్పష్టం అవుతున్నది. అన్ని భారతీయ భాషల్లో దాని అనువాదాలు వెలువడ్డాయి. 1916 ఏప్రిల్ లో హోంరూల్ లీగ్‌ని స్థాపించి దాని లక్ష్యాలను వివరిస్తూ మధ్య భారత దేశంలో గ్రామ గ్రామాన తిరిగారు.

పబ్లిషర్ : కొక్కు రవికుమార్

# భారత ఆధునిక జీవశాస్త్ర పితామహులు భార్గవ



పుష్ప మిత్ర భార్గవ (పి.ఎం.భార్గవ) భారత దేశపు అగ్రశ్రేణి శాస్త్రవేత్తలలో ఒకరు. సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (అఅఓః) వ్యవస్థాపక డైరెక్టర్. భారత దేశంలో ఆధునిక జీవశాస్త్రం వాస్తుశిల్పిగా ప్రసిద్ధి చెందారు. భారత దేశంలో బయోటెక్నాలజీ రంగంలో మార్గదర్శకుడు మరియు "జెనెటిక్ ఇంజనీరింగ్" అనే పదాన్ని ఉపయోగించిన మొదటి వ్యక్తులలో ఒకరు. 70 వ దశకంలో బయోటెక్నాలజీ విభాగం ఏర్పాటులో భార్గవ కీలక పాత్ర పోషించారు. ఆయన హైదరాబాదులో మెడికల్ అవేర్ మరియు రెస్పాన్సిబుల్ సిటిజన్స్ ఛైర్మన్ కూడా. భార్గవ 1928 అజయ్మేరు ( రాజస్థాన్ ) లో ఒక మధ్య తరగతి కుటుంబంలో, వైద్యుడు, ప్రజారోగ్య నిపుణుడైన రామ్ చంద్ర భార్గవ, గాయత్రి భార్గవ దంపతులకు జన్మించారు. 29ఏళ్ళప్రాయంలో కుటుంబం వారణాసికి మారగా, నేరుగా తొమ్మిదవ తరగతికి నేరుగా బెసెంట్ థియోసాఫికల్ స్కూల్లో చేరారు. పాఠశాల తర్వాత, అతను ఆ సమయంలో ఉత్తర ప్రదేశ్‌లోని ఉత్తమ సంస్థలలో ఒకటైన క్వీన్స్ కాలేజీ నుండి ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. 1944 లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ తో బీఎస్సీ, 1446లో ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ అలాగే 1949 లో 21 సంవత్సరాల వయస్సులో సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీ హెచ్ డీ పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చి 1950 నుంచి 1953 మధ్య కాలంలో ప్రస్తుతం ఉన్న ఐఐసీటీలో, ఉస్మానియా యూనివర్సిటీలో పరోశధకుడిగా పనిచేశారు. తర్వాత 1953 నుంచి 56 వరకు అమెరికా వెళ్ళి అక్కడి యూనివర్సిటీ ఆఫ్ విస్కానిసన్, మెడిసన్‌లో ప్రఖ్యాత శాస్త్రవేత్త హెడెల్ బర్గర్‌తో కలిసి విస్తృతమైన పరిశోధనలు చేశారు. 1956- 57 వరకు లండన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ రిసెర్చ్‌లో పనిచేసి, 1977లో ఇండియాకు వచ్చి తిరిగి హైదరాబాద్ లోని సెంట్రల్ లాబొరేటరీస్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌లో చేరారు. తర్వాత ఐఐసీటీలో పనిచేస్తూనే, ఆధునిక జీవశాస్త్ర విభాగాలలో పరిశోధన సంస్థ అయిన హైదరాబాద్ సెంటర్ ఆఫ్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీని స్థాపించారు. 1977 ఏప్రిల్ 1 న అది సెమీ అటానమస్ కేంద్రంగా స్థాపించ బడింది. 1990 లో డైరెక్టర్ పదవి నుంచి రిటైర్ అయ్యారు. భార్గవ యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, జర్మనీలలో పనిచేశారు. 50 కి పైగా దేశాలలో పర్యటించారు. భార్గవ భారత ప్రభుత్వ విధానాల గురించి బాగా తెలిసిన వ్యక్తి. నేషనల్ నాలెడ్జ్ కమిషన్‌లో వైస్ ఛైర్మన్ పదవిని పొందారు. జాతీయ భద్రతా సలహా మండలిలో సభ్యుడిగా, భారత ప్రభుత్వ జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీలో భారత సుప్రీంకోర్టు నామినీగా పనిచేశారు. భార్గవ చాలాకాలంగా సైన్స్ మరియు హేతుబద్ధతను ప్రోత్సహించడంలో, మూఢనమ్మకాలను వ్యతిరేకించడంలో పాలు పంచు కున్నారు. 1946 లో శాస్త్రవేత్తల ట్రేడ్ యూనియన్‌గా స్థాపించబడిన అసోసియేషన్ ఆఫ్ సైంటిఫిక్ వర్కర్స్ ఇన్ ఇండియా (యాచిఎ) తో సంబంధం కలిగి ఉన్నారు. 1976 లో 42 వ రాజ్యాంగ సవరణలో భారతదేశ పౌరుల ప్రాథమిక విధిగా శాస్త్రీయ స్వభావాన్ని పొందు పరచడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మాలిక్యులర్ బయాలజిస్ట్ గా ఆయన అందించిన సేవలకు గాను 1986లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. భార్గవ 100 కి పైగా జాతీయ మరియు అంతర్జాతీయ గౌరవాలు, పురస్కారాలను అందుకున్నారు. భార్గవ వేలాది ఉపన్యాసాలు ఇచ్చారు. 550 కి పైగా ప్రముఖ వ్యాసాలు, ఆరు పుస్తకాలు రాశారు. 125 కి పైగా శాస్త్రీయ పత్రాలను ప్రచురించారు.

హైదరాబాదు లోని ఉప్పల్‌లోని ఐదు అంతస్తుల నివాసంలో ఒక అంతస్తును పరిశోధన శాలకు, మరో అంతస్తును లైబ్రరీకి కేటాయించారు. ఇటీవల వరకూ ఆయన అనేక ఫార్మా కంపెనీలకు సలహాదారుగా పని చేశారు. ఆయన సంభవన ట్రస్ట్, భోపాల్, మరియు ప్రాథమిక పరిశోధన, విద్య మరియు అభివృద్ధి సంఘం (ఃఖీఇంఆ), న్యూఢిల్లీలో 2005 మరియు 2007 మధ్య నేషనల్ నాలెడ్జ్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా పనిచేశారు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక దేశ వ్యాప్తంగా అసహనం, దళితులపై దాడులు పెరిగి పోతున్నాయని నిరసన వ్యక్తం చేస్తూ.. 2016లో పద్మభూషణ్ అవార్డును వెనక్కి ఇస్తున్నట్టు ప్రకటించారు. భారత ప్రభుత్వం విశ్వ విద్యాలయాలలో అకడమిక్ కోర్సులను ప్రవేశపెట్టాలని మరియు జ్యోతిషశాస్త్రంలో సైన్స్ డిగ్రీలను అందించాలని నిర్ణయించుకుంది.

దీనిని వ్యతిరేకిస్తూ ఒక రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వ్రాతపూర్వక పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తోసిపుచ్చింది. జస్టిస్ సిన్హా ఈ మెరిట్‌లెస్ పిటిషన్‌ను కోర్టుకు తీసుకు వచ్చినందుకు ఎలాంటి శిక్షా ఖర్చులు విధించలేదు. భార్గవ కూడా సుప్రీం కోర్టులో సంబంధిత మంత్రిత్వ శాఖను ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారా సవాలు చేశారు. దీనిని భారత అత్యున్నత న్యాయస్థానం కూడా తోసిపుచ్చింది. పదవులు చేపట్టడానికి ఎప్పుడూ భయపడని, అధికారానికి ఎప్పుడూ తలవంచని, నచ్చని విషయాలను వ్యతిరేకించే వ్యక్తిత్వం ఉన్న పుష్ప మిత్ర భార్గవ ఆగస్టు 1, 2017 న హైదరాబాదులో మరణించారు.

# తల్లిపాలకు ప్రత్యామ్నాయం వుందా?




పిల్లలకు తల్లిపాలు అత్యంత శ్రేష్ఠమనీ, చంటి పిల్లలకు చనుబాలిస్తేనే తల్లికి జన్మ ధన్యమైనట్లనీ, పాలిచ్చేతల్లి ఉంటే చంటిపిల్లలకు ఇంక ప్రపంచంలో ఏమీ అవసరం లేదనీ ఒకనాడు భావించే వారు. పిల్లల్ని కనడం, పాలివ్వడం ఒక వరంగా, మాతృత్వానికి పరాకాష్టగా భావించేవారు ఆనాడు. తల్లిపాల ద్వారా ప్రపంచం లోని క్షీరదాలు తమ పిల్లలను తమ పాలతోనే పెంచుతున్నప్పటికీ, ప్రకృతి సహజంగా ప్రసాదించిన తల్లి పాలను ఉపయోగించుకోక పోవడం మానవజాతి పరిణామంలో ఒక చిత్రాతి చిత్రమైన పరిస్థితి. నేడు వివిధ కారణాల వల్ల తల్లిపాలకు ప్రత్యామ్నాయం అనుసరించడం అత్యంత బాధాకరం. తల్లిపాలను భారత దేశంలో కేవలం 37 శాతం మంది పిల్లలే ఆరునెలల వరకు తాగుతున్నారు. అంటే పిల్లలకు ఎంత తక్కువ పాళ్ళల్లో తల్లి పాలు అందిస్తున్నారో అర్థం అవుతోంది. కారణం తల్లిపాల గొప్పతనం తెలియక పోవడం కావచ్చు, కొంతమంది వక్షోజాలు అందం తగ్గుతుందనో, లేదా ఇచ్చే వెసులుబాటు లేకపోవడమో కానీ చాలామంది శిశువులకి తల్లిపాల రుచి అందడం లేదు. నిజానికి చనుబాలు పిల్లలకు ప్రత్యేక ఔషధంగా పనిచేస్తాయి. తల్లిపాలను సరిగ్గా పిల్లలకు ఇవ్వగలిగితే ఏటా 8.23 లక్షల మంది పిల్లలను ఐదేళ్ల లోపు మరణించకుండా కాపాడు కోవచ్చు. పిల్లలకు చనుబాలు ఇవ్వక పోవడం వల్ల, రొమ్ము కేన్సర్లతో మరణిస్తున్న మహిళల సంఖ్య 20 వేల వరకు ఉంది అంటే ఈ సమస్య ఎంత ఎక్కువగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తల్లి పాల విశిష్టతను తెలిపే రీతిలో ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగష్టు నెల మొదటి వారం రోజులు తల్లిపాల వారోత్సవాలుగా వాబా (వరల్డ్ అలైన్స్ ఫర్ (బ్రెస్ట్ ఫీడింగ్ ఎక్షన్ ) సంస్థ పర్యవేక్షణలో డబ్ల్యు. హెచ్.ఓ, యునిసెఫ్, బి.పి.ఎన్.ఐ వంటి అంతర్జాతీయ, జాతీయ సంస్థల అనుబంధంగా జరుపు తున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. పుట్టిన పసి పిల్లలకు శక్తితో పాటు, శారీరక అనారోగ్య సమస్యలు, మానసిక పరమైన సమస్యలను తల్లి పాలు దరిచేర నియ్యవు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వకుంటే భవిష్యత్తులో పలు విధాలైన ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శిశువుకు తల్లిపాలను మించిన ఆహారం లేదు. ప్రోటీన్లు, విటమిన్లతో కూడిన తల్లిపాలను తాగించినప్పుడే బిడ్డ ఆరోగ్యంగా పెరగ గలుగుతుంది. తల్లి పాలలో కార్బోహైడ్రేట్స్ 7.1%, ఫాట్స్ 4.5%, ప్రోటీన్స్ 0.9%, మినరల్స్ 0.2%, డైజెస్టివ్ ఎంజైమ్స్, హార్మోన్లు, విటమిన్లు, యాంటీ బాడీలు, లింఫోసైట్లు ఉంటాయి. అందుకే తల్లిపాలను తప్పని సరిగా తాగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేస్తోంది. కన్న బిడ్డకు తల్లిపాలు పట్టించడం చాలా అవసరం. తల్లి పాలు తాగడం వల్ల పుట్టిన బిడ్డ రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కనుక బిడ్డకు కనీసం ఆరు నెలలు నిండే వరకైనా తల్లి పాలు తప్పనిసరిగా ఇవ్వాలని వైద్యులు సూచిస్తుంటారు. మార్గదర్శకాల ప్రకారం 6 నెలల తర్వాత చనుబాలు మరిచి పోయేలా చేసి మరో ప్రత్నామ్నాయ ఆహారం ఇవ్వడం ప్రారంభించాలి. బిడ్డకు అవసరమైన పోషకాలు తల్లిపాల ద్వారా లభించాక, ఇతర ఆహారాల ద్వారా పిల్లలకు పోషకాలను అందించాలి. తల్లి బిడ్డకు తన చను పాలు ఇవ్వడం వలన బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుంది. అంతేకాకుండా తల్లికి కూడా మేలు జరుగుతుంది. తల్లిపాలు పట్టించడం వల్ల శిశుకు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ, డయేరియా, వాంతుల సమస్య నుంచి రక్షణ లభిస్తుంది. పిల్లలు పెద్దయ్యాక ఊబకాయం, మరికొన్ని ఇతర అనారోగ్య సమస్యల ముప్పు తగ్గుతుంది. తల్లికి రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది.

ప్రసవమయిన మొదటి రోజు నుండీ నాలుగు రోజుల వరకూ రొమ్ముల నుండీ చిక్కటి పసుపు పచ్చటి ద్రవం స్రవిస్తుంది. దీనిని కొలోస్ట్రమ్ లేదా "ముర్రుపాలు" అంటారు. ఆ తర్వాతే తెల్లటి పాలు వస్తాయి. ఈ ముర్రుపాలు శిశువులకు చాలా ముఖ్యం. మొదటి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా బిడ్డకు జీర్ణకోశ సంబంధిత సమస్యలు ఉండవు. జీర్ణకోశ వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. చాలా తేలికగా అరుగుదల జరుగుతుంది. బిడ్డకు మలబద్దక సమస్య ఉండదు. తల్లిపాల వలన ఆస్తమా, చెవి సంబందించిన వ్యాధులు రాకుండా కాపాడుతుంది. తల్లిపాల వలన... స్థూలకాయం ఉండదని శాస్త్రవేత్తల పరిశోధన వలన తేలింది. తల్లిపాలు... పిల్లల దశలో లుకేమియా వ్యాధి రాకుండా, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధి పెద్ద వయస్సులో రాకుండా కాపాడుతుంది. తల్లిపాలు - పిల్లల తెలివి తేటలను పెంచుతుంది. తల్లి పాలలో చాలా ఫాటీ ఆసిడ్స్ ఉన్నందున, ఇవి పిల్లలలో మెదడు పెరుగుదలకు ఉపయోగ పడుతుంది.

# వరల్డ్ వైడ్ వెబ్‌తో ప్రపంచమే కుగ్రామం!

ప్రపంచ మానవాళి అంతర్జాలంతో అనుసంధానం అయ్యింది. 1989లో కంప్యూటర్ శాస్త్రవేత్త టిమ్ బెర్నర్స్-లీ విప్లవాత్మకమైన "వరల్డ్ వైడ్ వెబ్ (డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ)"ను ప్రతిపాదించడం, ఆగష్టు 1991లో ప్రజలకు అందుబాటులోకి రావడం, 1993 నుంచి ఉచితంగా యాక్సెస్ చేయవచ్చని వెల్లడించడం ఓ అద్భుత అంశం. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ రాకతో ప్రపంచం మన చేతి వేళ్ల దరికి చేరింది. అపారమైన జ్ఞానం మన ముంగిట నిలిచింది.

కేవలం ఒక్క క్లిక్‌తో కావలసిన సమాచారం మన కళ్ల ముందు ప్రత్యక్షం అవుతున్నది. మానవాళిని అనుసంధానించే ఇంటర్నెట్, డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ పోషిస్తున్న పాత్ర అనన్యసామాన్యం. సోషల్ మీడియా వేదికలు, సమాచార సేకరణ, నైపుణ్య వికాసం, వినోద పరిశ్రమ, ఈ-వ్యాపారాలు, హైపర్ టెక్స్ట్, గ్రాఫిక్స్, ఆడియో వీడియో, మల్టీ మీడియా, ఆన్‌లైన్ అద్భుతాలు లాంటి ప్రయోజనాలు సుసాధ్యం కావడానికి డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ పాత్ర అద్వితీయం. ఈ అత్యాధునిక ఆవిష్కరణను ప్రచారం చేయడానికి, వెబ్ ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏటా 01 ఆగష్టున అధికారికంగా "ప్రపంచ వరల్డ్ వైడ్ వెబ్ దినోత్సవం" లేదా "ప్రపంచ వెబ్ దినోత్సవం" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ వెబ్ దినోత్సవం-2026 ఇతివృత్తంగా "ఎనర్జీ-అవేర్ వెబ్ అండ్ ఏఐ సిస్టమ్స్ ఫర్ సస్టేనబులిటీ" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ ఆవిష్కరణతో ప్రపంచ మానవాళికి సమాచార వితరణ, వాణిజ్యం, జ్ఞాన సమపార్జన లాంటివి చాలా తేలిక అయిపోయాయి. 1991 - 2004 మధ్య వెబ్ 1.0 వర్షన్ ఉండడం, నేడు వెబ్ 2.0 వర్షన్ వాడుకలో ఉన్నది. ఆధునిక మానవుడు వెబ్, అంతర్జాల వలయంలో మునిగి తేలుతున్నాడు. స్మార్ట్‌ఫోన్ రాకతో అతి సామాన్యుల ముంగిట్లో కూడా ఇంటర్నెట్ ప్రవేశించింది. మితిమీరిన వాడకంతో ఇంటర్నెట్ దురలవాటు బారిన కూడా యువత, పిల్లలు పడడం చూస్తున్నాం. అంతర్జాల రాకతో విశ్వ విజ్ఞానం మన అరచేతిలో ఇమిడి పోయింది. అంతర్జాలంతో అసంఖ్యాక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దాని పట్ల జాగ్రత్తగా ఉండని యెడల పలు ప్రమాదకర నష్టాలు కూడా మన అనుభవంలోకి వస్తున్నాయి. అంతర్జాలాన్ని వినియోగిస్తున్న నెటిజెన్లు పలు సందర్భాల్లో ప్రతికూల అనుభవాలు, సైబర్ బుల్లీయింగ్, తిట్ల దండకాలు, అక్రమ వినియోగాలు, అసభ్యకర అవమానకర మాటలను వినవలసి వస్తున్న వేళ సురక్షిత ఇంటర్నెట్ పట్ల అవగాహన కల్పించాల్సిన అగత్యం ఏర్పడింది.

అంతర్జాలం వాడడం తప్పనిసరి అవుతున్న దాని పట్ల కనీస పరిజ్ఞానం, తగు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరం అవుతున్న వేళ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించుకునే మార్గాలను అవగాహన పరచడానికి 2004 నుంచి ప్రతి ఏట 10 ఫిబ్రవరిన ప్రపంచ దేశాలు "సురక్షిత అంతర్జాల దినం" లేదా "సేఫర్ ఇంటర్నెట్ డే" కూడా పాటించడం ఆనవాయితీగా మారింది. నేటి సమాజంలో విద్యాలయాలు, కుటుంబాలు, బంధు మిత్రులు, సహచర వర్గాలు, పౌర సమాజాల్లో సురక్షితంగా అంతర్జాలాన్ని ఎలా వినియోగించాలో ప్రజలకు, విద్యార్థులకు తెలుపవలసిన అవసరం వచ్చింది. ఆన్‌లైన్‌లో గౌరవంగా మాట్లాడడం, సత్ప్రవర్తనతో వినియోగించడం, సహానుభూతి ప్రదర్శించడం, హానికరమైన చర్యలకు దూరంగా ఉండడం లాంటివి మనం ఆచరణలో పెట్టాలి.

సురక్షిత అంతర్జాల దినం-2026 ఇతివృత్తంగా "అందరు కలిసి సురక్షిత అంతర్జాలాన్ని నిర్మించుకుందాం" అనబడే అంశాన్ని తఈసుకున్నారు. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ, అంతర్జాల విచక్షణారహిత వాడకంతో అనేక ప్రమాదకర పరిస్థితులు ఎదురు అవుతున్నాయి. వెబ్, ఇంటర్నెట్ ప్రధాన దుర్వినియోగాల్లో సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, ఫిషింగ్ స్కామ్, డాటా బ్రీచింగ్, అనధికారిక చొరబాట్లు, మాల్‌వేర్, ఆన్‌లైన్ గేమింగ్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, ఆన్‌లైన్ ప్రిడేటర్స్, సెక్స్టింగ్, రాన్‌సమ్‌వేర్, సైబర్ క్రైమ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు, ఆన్‌లైన్ అప్పుల వేధింపులు, డిజిటల్ అరెస్టులు, వ్యక్తిగత సమాచారాన్ని దోచేసి వేధించడం లాంటి పలు అంశాల పట్ల తగు జాగ్రత్తగా ఉండడం అనివార్యం అయ్యింది. వీటి పట్ల అవగాహన లేని యెడల పలు చిక్కులను ఎదుర్కోవలసి వస్తుందని తెలుసుకోవాలి.

# 20.8 నుండి 9.8 శాతానికి పడిపోయిన 19 సేవా రంగాల ఉమ్మడి ఉత్పత్తి



దేశంలో సేవల రంగం మందగించింది. ఈ ఏడాది మే నెలలో భారీగా తగ్గిందని కేంద్ర గణాంక, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సర్వీసెస్ ప్రొడక్షన్ ట్రయల్ ఇండెక్స్ (ఐఎస్‌పి) నివేదికలో వెల్లడయ్యింది. ఐఎస్‌పిలోని 19 సేవల రంగాల్లో రెండింటిని మినహాయించి మిగిలిన అన్ని రంగాల వృద్ధి మందగించినట్లు నివేదిక స్పష్టం చేసింది. మంత్రిత్వ శాఖ మొత్తం వృద్ధి రేటును నేరుగా ప్రకటించనప్పటికీ.. ఆర్థిక వేత్తల అంచనాల ప్రకారం ఈ 19 సేవల రంగాల ఉమ్మడి ఉత్పత్తి వృద్ధి ఏప్రిల్‌లో నమోదైన 20.8 శాతం నుంచి మే నెలలో 9.8 శాతానికి పడిపోయింది.

రిటైల్ ట్రేడ్, రోడ్డు రవాణా, ఐటి, అడ్మిన్ అండ్ సపోర్ట్ సర్వీసెస్ రంగాల్లో వృద్ధి మందగించడం వల్లే ఈ క్షీణత నమోదైందని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ చీఫ్ ఎకనామిస్ట్ రజనీ సిన్హా తెలిపారు. అయితే వసతి, ఆహార సేవలు, రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ వంటి 8 రంగాల్లో మాత్రం రెండంకెల వృద్ధి నమోదై మొత్తానికి సేవల రంగానికి కొంత మద్దతుగా నిలిచాయని ఆమె పేర్కొన్నారు. ఏప్రిల్ నెలలో 14 రంగాలు రెండంకెల వృద్ధిని సాధించగా.. మే నెలలో కేవలం 8 రంగాలు మాత్రమే ఈ జాబితాలో నిలిచాయి. విభాగాల వారీగా పరిశీలిస్తే.. మే నెలలోనూ వసతి, ఆహార సేవల రంగం అత్యధికంగా 27.4 శాతం పెరుగుదల ముందువరుసలో నిలిచింది. ఏప్రిల్‌లో ఇది 37.2 శాతంగా ఉంది. ఇక ఐఎస్‌పిలో అత్యధికంగా 22.5 శాతం వెయిటేజీ ఉన్న ఐటి, కంప్యూటర్ సంబంధిత సేవలు ఏప్రిల్‌లో 15.2 శాతం వృద్ధిని సాధించగా.. మే నెలలో 10.3 శాతానికి పరిమితమయ్యాయి. ఏప్రిల్‌లో 0.4 శాతం క్షీణించిన రైల్వే రవాణా మే నెలలో 3.4 శాతం వృద్ధిని నమోదు చేసింది. పశ్చిమాసియాలో ఘర్షణలు, ఇంధన ధరల భారం కారణంగా విమానయాన రంగం వరుసగా రెండో నెల కూడా ప్రతికూల వృద్ధిని చవి చూసింది. ఈ రంగం ఏప్రిల్‌లో 13.9 శాతం క్షీణత చవి చూడగా.. మే నెలలో 2.8 శాతానికి పరిమితం చేసుకుంది.

## గూగుల్‌పే-ఎస్‌బీఐ కార్డ్ కొత్త క్రెడిట్ కార్డ్

డిజిటల్ చెల్లింపులను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ గూగుల్‌పే, ఎస్‌బీఐ కార్డ్ కలిసి కొత్త కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డును తీసుకొచ్చాయి. గూగుల్‌పే ఫ్లెక్స్ ఎస్‌బీఐ కార్డ్ పేరుతో తెచ్చిన ఈ సదుపాయం ద్వారా రోజువారీ ఖర్చులపై ఎక్కువ రివార్డ్స్ అందించేలా రూపొందించారు. ఈ కార్డ్‌తో వినియోగదారులు ఏడాదికి గరిష్ఠంగా రూ.18,000 విలువైన రివార్డ్స్ పొందే అవకాశం ఉంటుంది. కిరాణా, యుటిలిటీ బిల్లులు, ప్రయాణం, షాపింగ్ వంటి అర్హత గల లావాదేవీలపై ఖర్చు చేసిన ప్రతి రూ.500కు గరిష్ఠంగా 8 గూగుల్‌పే స్టార్స్ లభిస్తాయి. ఒక్క స్టార్ విలువ రూ.1. ఈ స్టార్స్‌ను గూగుల్‌పేలోనే చెల్లింపుల సమయంలో వెంటనే ఉపయోగించుకోవచ్చు లేదా వోచర్లుగా మార్చుకోవచ్చు. కార్డ్ కోసం దరఖాస్తు చేయడం, ఖర్చులను ట్రాక్ చేయడం, రివార్డ్స్ రిడీమ్ చేసుకోవడం, అకౌంట్ నిర్వహణ వంటి అన్ని సేవలు గూగుల్‌పే యాప్‌లోనే అందుబాటులో ఉంటాయి. ఈ కార్డ్ రూపే, వీసా వంటి రెండు వేరియంట్లలో లభిస్తుంది. రూపే వెర్షన్‌ను యూపీఐతో లింక్ చేసి, యూపీఐ యాక్సెస్ ఉన్న వ్యాపారుల వద్ద నేరుగా క్రెడిట్ కార్డ్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు. కార్డ్‌కు రూ.499 జాయినింగ్, వార్షిక ఫీజు ఉండగా, ఏడాదిలో రూ.1 లక్ష ఖర్చు చేస్తే ఆ ఫీజు కూడా మాఫీ అవుతుంది. కొత్త వినియోగదారులకు రూ.1,000 విలువైన వెల్‌కమ్ బెనిఫిట్స్ కూడా ఉన్నాయి.




## బంగారం అమ్మకాలకు ధరల దెబ్బ....



బంగారం అమ్మకాలను అధిక ధరలు దెబ్బతీశాయి. దేశంలో ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో బంగారం డిమాండ్ పరిమాణం పరంగా 6 శాతం క్షీణించి 131.4 టన్నులకు పడిపోయినట్లు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) తాజా నివేదికలో వెల్లడించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో మొత్తం డిమాండ్ 139.7 టన్నులుగా నమోదయ్యింది. సీజనల్ డిమాండ్ మందగించడం, కస్టమ్స్ డ్యూటీ పెంపుదల అమ్మకాలను ప్రభావితం చేశాయని డబ్ల్యుజిసి తన నివేదికలో పేర్కొంది. ?మరోవైపు విలువ పరంగా పసిడి కొనుగోళ్లు 50 శాతం పెరిగి రూ.1,98,100 కోట్లకు చేరుకుంది. గతేడాది ఇదే కాలంలో ఈ విలువ రూ.1,32,500 కోట్లుగా ఉందని డబ్ల్యుజిసి ఇండియా రీజినల్ సిఇఒ సచిన్ జైన్ తెలిపారు. అధిక ధరల పరిస్థితుల్లోనూ భారతీయులు బంగారానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం సగటు ధర గతేడాది రెండో త్రైమాసికంలో 3,280.4 అమెరికన్ డాలర్లుగా ఉండగా.. ఈ ఏడాది అది 4,506.3 డాలర్లకు పెరిగింది. ఇక దేశీయంగా దిగుమతి సుంకం, జిఎస్‌టి మినహాయించి ఏప్రిల్-జూన్ మధ్య పది గ్రాముల సరాసరి ధర రూ.1,50,744.8గా నమోదయ్యింది. గతేడాది ఇది రూ.94,875.9గా ఉంది.

గడిచిన జూన్ త్రైమాసికంలో అభరణాల డిమాండ్ 15 శాతం తగ్గి 75.1 టన్నులకు పడిపోయింది. గతేడాది ఇదే సమయంతో ఇది 88.8 టన్నులుగా ఉంది. బార్లు, కాయిన్ల డిమాండ్ 9 శాతం పెరిగి 50.3 టన్నులకు చేరుకుంది. గ్లోబల్ మార్కెట్‌లో నిధులు తరలిపోయినప్పటికీ భారతీయ గోల్డ్ ఈటిఎఫ్‌లోకి 4.2 టన్నులు పెట్టుబడులు వచ్చాయి. అయితే దిగుమతి సుంకం పెరిగిన తర్వాత మార్కెట్లో అక్రమ రవాణా పెరిగిపోవడంపై సచిన్ జైన్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో పాత బంగారం రీసైక్లింగ్ 17 శాతం తగ్గి 19.2 టన్నులకు పడిపోగా, మొత్తం బంగారం దిగుమతులు 23 శాతం క్షీణించి 98.1 టన్నులకు పరిమితమయ్యాయి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులు, వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణాన్ని బట్టి చూస్తే ఈ ఏడాది మొత్తం మీద దేశంలో బంగారం డిమాండ్ 650 నుండి 750 టన్ల మధ్య ఉండొచ్చని డబ్ల్యుజిసి అంచనా వేస్తోంది.

## రెపో రేటుపై ఆర్బీఐ కీలక నిర్ణయం




మధ్యప్రాచ్యంలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని అనిశ్చితుల నడుమ భారతీయ రిజర్వ్ బ్యాంక్ తన రాబోయే ఆగస్టు ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనుంది. ఆగస్టు 3 నుండి 5 తేదీల వరకు జరగనున్న సమీక్షా సమావేశంలో బెంచ్‌మార్క్ రెపో రేటును ప్రస్తుత 5.25 శాతం వద్దే యథాతథంగా ఉంచవచ్చని అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ నిర్వహించిన తాజా పోల్ వెల్లడించింది. ఆర్థిక వ్యవస్థ పురోగతిని, ద్రవ్యోల్బణ పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్న ఆర్‌బిఐ.. వడ్డీ రేట్లను పెంచకుండా సుదీర్ఘకాలం పాటు ఇదే స్థిరత్వానికి మొగ్గు చూపే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. రాయిటర్స్.. జూలై 21 నుండి జూలై 27 మధ్యకాలంలో 72 మంది ప్రముఖ ఆర్థికవేత్తలతో ప్రత్యేక సర్వే నిర్వహించింది. ఇందులో పాల్గొన్న విశ్లేషకులలో ఏకంగా 95 శాతం మంది, అంటే 68 మంది ఆర్థికవేత్తలు ఆర్‌బిఐ రెపో రేటులో ఎలాంటి మార్పులు చేయదని ఖచ్చితమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేవలం నలుగురు నిపుణులు మాత్రమే 25 బేసిస్ పాయింట్ల (0.25%) స్వల్ప పెంపు ఉండవచ్చని అంచనా వేశారు. గత డిసెంబర్‌లో రెపో రేటును 5.25 శాతానికి చేర్చిన ఆర్‌బిఐ.. అప్పటి నుండి అదే వైఖరిని కొనసాగిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో రాబోయే డిసెంబర్ నాటికి లేదా 2027 ఆరంభం వరకు కూడా వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చని ఆర్థిక రంగ నిపుణులు పేర్కొంటున్నారు. దేశీయ రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెలలో 4.38 శాతానికి పెరిగినప్పటికీ.. ప్రస్తుత దశలో రుణ వ్యయాలను పెంచే ఆలోచన అకాలమని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వ్యాఖ్యానించడంతో రేట్ల పెంపు సంకేతాలకు తెరపడింది. సర్వే అంచనాల ప్రకారం 2026-27 ఆర్థిక సంవత్సరంలో సగటు ద్రవ్యోల్బణం 4.8 శాతంగా ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఇది ఆర్‌బిఐ మునుపటి అంచనా అయిన 5.1 శాతం కంటే తక్కువగా ఉండటంతో.. కేవలం ద్రవ్యోల్బణ భయాలతో రేట్లను పెంచాల్సిన తక్షణ ఆవశ్యకత ఆర్‌బిఐకి కనిపించడం లేదు. ప్రస్తుత తరుణంలో తక్షణ వడ్డీ రేట్ల పెంపు కంటే దేశీయ ఆర్థిక వృద్ధికి ఉన్న నష్టాలే ఎక్కువని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. అమెరికా విధిస్తున్న సుంకాల ప్రభావం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలలో వచ్చే వ్యత్యాసాలు, కరెన్సీ హెచ్చుతగ్గులు భారత మార్కెట్లపై ఒత్తిడి తెస్తున్నప్పటికీ..

తొందరపడి వడ్డీ రేట్లను పెంచడం వల్ల స్థానిక వ్యాపారాలు, ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటాయని ఎస్‌టిసిఐ ప్రైమరీ డీలర్ ముఖ్య ఆర్థికవేత్త ఆదిత్య వ్యాస్ పేర్కొన్నారు. ఒకవేళ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లకు పైబడి సుదీర్ఘకాలం ఉంటే తప్ప ఆర్‌బిఐ తన వైఖరిని మార్చుకోకపోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

## డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు భారీ డిమాండ్



దేశంలో పెళ్లిళ్ల తీరు వేగంగా మారుతోంది. భారీ అతిథుల జాబితా, ఆర్భాట వేడుకల కంటే కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి ప్రత్యేక అనుభవాన్ని ఆస్వాదించే 'డెస్టినేషన్ వెడ్డింగ్'ల వైపు ఎక్కువమంది మొగ్గు చూపుతున్నారు. వెడ్‌మీగూడ్ విడుదల చేసిన 'డెస్టినేషన్ వెడ్డింగ్ రిపోర్ట్ 2026' ప్రకారం, ప్రస్తుతం దేశంలోని మొత్తం పెళ్లిళ్లలో దాదాపు నాలుగింట ఒక వంతు డెస్టినేషన్ వెడ్డింగ్‌లే ఉండగా, 2028 నాటికి ఈ వాటా 30-32 శాతానికి చేరే అవకాశం ఉంది. డెస్టినేషన్ వెడ్డింగ్‌ల సగటు బడ్జెట్ కూడా ఏడాదిలో 8 శాతం పెరిగి రూ.58 లక్షలకు చేరుకుంది. ఇంటర్నేషనల్ డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు సగటు ఖర్చు రూ.1.5 కోట్లకు పైగానే ఉంది.

ప్రస్తుతం 42 శాతం మంది భారీ వేడుకల కంటే చిన్న కార్యక్రమాలనే ఇష్టపడుతున్నారు. అతిథులకు ప్రత్యేక ఆహారం, వెల్‌నెస్ యాక్టివిటీలు, ఎక్కువ రోజుల వేడుకలు వంటి అంశాలకు ప్రాధాన్యం పెరగడంతో, డెస్టినేషన్ వెడ్డింగ్‌ల సగటు వ్యవధి 2020కి ముందు 1.8 రోజుల నుంచి ఇప్పుడు 3.2 రోజులకు పెరిగింది. రానున్న సంవత్సరాల్లో ఆసియా దేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు డిమాండ్ మరింత పెరిగే అవకాశముందని, వ్యక్తిగత అనుభవాలు, లగ్జరీ ప్రయాణం, ప్రత్యేక వేడుకలకే భారతీయ జంటలు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్టు నివేదిక పేర్కొంది.

## బీమా రంగంలోకి పతంజలి..


వ్యాపారవేత్త, యోగా గురు రామ్‌దేవ్ బాబా తన సంపదను పెంచుకోవడానికి కొత్త వ్యాపారాలపై దృష్టి పెంచారు. ?ఇప్పటికే ఆయుర్వేదం, ఎఫ్‌ఎంసిజి రంగాల్లో పతంజలి పేరుతో భారీగా గడిస్తున్న రామ్‌దేవ్ బాబా ఇప్పుడు ఆర్థిక సేవల రంగంలోకి అడుగుపెడుతోంది. మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డిఎఐ ఆమోదం తెలిపింది.

ఈ డీల్‌లో భాగంగా పతంజలి ఆయుర్వేద 73.56 శాతం, డిఎస్ గ్రూప్ 24.5 శాతం వాటాను దక్కించుకోనున్నాయి. సనోటి ప్రాపర్టీస్ ఎల్‌ఎల్‌పి నుంచి ఈ రెండు సంస్థలు కలిపి దాదాపు 98 శాతం వాటాను కొనుగోలు చేయనున్నాయి. లావాదేవీని మూడు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. మోటార్, హెల్త్, ప్రాపర్టీ, కమర్షియల్ ఇన్సూరెన్స్ వంటి విభాగాల్లో మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ కార్యకలాపాలు సాగిస్తోంది. ఇప్పటివరకు




ఆయుర్వేదం నుంచి పర్సనల్ కేర్, ప్యాకేజ్డ్ ఫుడ్స్, వినియోగ వస్తువుల వరకు విస్తరించిన పతంజలి.. ఈ కొనుగోలుతో ఎఫ్‌ఎంసిజికి అతీతంగా ఆర్థిక సేవల రంగంలోకి ప్రవేశిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న తన రిటైల్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను బీమా వ్యాపార విస్తరణకు ఉపయోగించుకునే అవకాశం ఉంది.

## ఏఐ సూపర్-యాప్‌ను సిద్ధం చేస్తున్న మైక్రోసాఫ్ట్



క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విభాగాల్లో ఊహించని విజయంతో మైక్రోసాఫ్ట్ రికార్డు స్థాయి ఆర్థిక ఫలితాలను సాధించింది. వార్షిక ఆదాయం ఏకంగా 331 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 27.7 లక్షల కోట్లు) చేరగా, అందులో అజూర్ క్లౌడ్ వ్యాపారం మొదటిసారిగా 100 బిలియన్ డాలర్ల మైలురాయిని దాటింది. ఈ ఆర్థిక ఫలితాల వేళ కంపెనీ సీఈఓ సత్య నాదెళ్ల కీలక ప్రకటన చేశారు.

ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న కోపైలట్ చాట్‌బాట్, గిట్‌హబ్ కోడింగ్ అసిస్టెంట్, కోవర్క్, ఆటోపైలట్ సిస్టమ్‌లను కలిపి 'ఒకే ఏఐ సూపర్-యాప్'గా తీసుకురానున్నట్లు వెల్లడించారు. త్వరలో రాబోతున్న ఈ కొత్త ప్లాట్‌ఫారమ్ ద్వారా కోడింగ్ నుంచి కార్పొరేట్ పనుల వరకు అన్నింటినీ ఒకే ఇంటర్‌ఫేస్ నుండి నిర్వహించవచ్చు. ఇది బిజినెస్ మార్కెట్‌లో ఏఐ ఆధిపత్యం చెలాయిస్తున్న ఓపెన్ ఏఐ, ఆంత్రోపిక్ సంస్థలకు నేరుగా సవాలు కానుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. గతంలో తన ఏఐ సేవల కోసం ప్రధానంగా ఓపెన్ ఏఐపై ఆధారపడిన మైక్రోసాఫ్ట్, ఇప్పుడు సొంత మోడళ్లు, చిప్‌ల అభివృద్ధితో సొంతంగా సామర్థ్యాన్ని కూడగడుతోంది.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com